సాక్షి
కర్నూలు
సోమవారం । 24 । మార్చి । 2025



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు పౌర్ణమి సందర్భంగా ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు మండపేటకు చెందిన వంక నరేంద్రబాబు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేది కపై ఆదివారం హైదరాబాద్‌కి చెందిన కె. రమాదేవి బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:35	ఉ॥ 4:57
ఆదోని	సా॥ 6:33	ఉ॥ 4:55
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 4:57
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:52
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:55

హదీస్ వెలుగు:

తరచూ ''అస్తగ్ ఫిరుల్లాహ్'' చదువుతూ ఉండండి. ''తౌబా'' చేస్తూ ఉండండి. తెలిసీ, తెలియక చేసిన పాపాలను అల్లాహ్ హరిస్తారు.

– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

నేడు అర్జీల స్వీకరణ

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు అర్జీలను సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ పోటీల్లో స్వర్ణం



క్రీడాకారిణి జాఫ్రీన్

కర్నూలు (టౌన్): అహ్మదాబాదులో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించిన సీనియర్ జాతీయ బధిరుల (డెఫ్) టెన్నిస్ క్రీడలో కర్నూలు క్రీడాకారిణి జాఫ్రీన్ బంగారు పతకం సాధించింది. కర్నూలులో డిప్యూటీ రిజిస్ట్రార్ కో–ఆపరేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆమె మహిళల సింగిల్స్ విభాగంలో స్వర్ణం, అలాగే నంద్యాల జిల్లాకు చెందిన చందన్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో బంగారు పతకం సాధించింది. దీంతో ఈ ఏడాది నవంబర్‌లో జపాన్ దేశంలో నిర్వహించనున్న అంతర్జాతీయ బధిరుల ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోటు చేసుకుంటున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీస్ శాఖ రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా అంతటా పోలీస్ స్టేషన్ల వారీగా 584 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలికి గౌరవ ప్రదమైన జీవితం కొనసాగించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇస్తూనే, కొత్తగా కేసుల్లో ఇరుక్కున వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. స్టేషన్ల వారీగా రౌడీ షీటర్లు జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై కూడా ఆరా తీస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే, పోలీస్ శాఖ పరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సబ్ డివిజన్ల వారీగా రౌడీ షీటర్లు ఇలా ...

జిల్లాలోని వివిధ సబ్ డివిజన్ల వారీగా 584 మంది రౌడీ షీటర్లు ఉన్నారు. అందులో కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో 199 మంది, ఆదోని 87, పత్తికొండ 112, ఎమ్మిగనూరులో 186 మంది ఉన్నారు.



హొళగుంద మండలం నెరణికి గ్రామంలో నీటి కోసం బిందెలను తీసుకొచ్చిన దృశ్యం

జలం ఇవ్వలేక చేతి పంపులు 'బోరు'మంటున్నాయి. బిందె నీటిని కూడా ఇవ్వలేక మంచినీటి పథకాలు దిష్టిబొమ్మల్లా మారాయి. చుక్కనీరు అందక పల్లెల్లో 'దాహం' కేకలు వినిపిస్తున్నాయి. మంచినీటి కోసం పనులు మానుకొని ప్రజలంతా ఇంటి వద్దే ఉండాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదు. అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు ఇవ్వడం లేదు. ప్రజల గొంతులు ఎండుతున్నా కనీస చర్యలు కరువయ్యాయి.

ఊరు అడుగుతోంది నీరు

- ఎండాకాలంలో ప్రజలకు అందని మంచినీరు
- తుంగభద్ర దిగువ కాలువ ఉన్నా తప్పని తిప్పలు
- 76 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంటుందని అధికారుల అంచనా
- రూ.6.91 కోట్ల ప్రతిపాదనలు పంపినా కనిపించని ఫలితం
- అడుగంటుతున్న ఎస్ఎస్ ట్యాంకుల్లోని నీటి నిల్వలు

కర్నూలు(అర్బన్): వేసవి కాలం ప్రారంభం కావడం, భూగర్భ జలాలు అడుగంటడం తదితర కారణాలో జిల్లాలో అనేక గ్రామాలు తాగునీటి ఇబ్బందులను చవిచూస్తున్నాయి. పల్లెల్లో చేతిపంపులు పనిచేయకపోవడంతో ప్రజలు వ్యవసాయ బావులు, బోర్లపై ఆధారపడ్డారు. తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొని జిల్లా పశ్చిమ ప్రాంతంలో పరిస్థితి దయనీయంగా మారింది. పలు గ్రామాల్లో సమీపంలోని ఎస్ఎస్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. కొంతమేర ముందస్తు చర్యలు చేపట్టినా.. ఆయా ఎస్ఎస్ ట్యాంకుల్లోని నీటి నిల్వలు రోజు రోజుకు తగ్గిపోతుండడంతో భవిష్యత్తును తలచుకొని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు రిజర్వాయర్లు, ఎస్ఎస్ ట్యాంకుల నుంచి సరఫరా అవుతున్న నీరు చివరి గ్రామాల వరకు వెళ్లకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

నీరు బంద్ అయితే..

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఎస్ఎస్ ట్యాంకులన్నీ తుంగభద్ర దిగువ కాలువ (ఎల్ఎల్‌సీ) నీటిపై ఆధారపడినవే. ఈ నీటిని ఈ నెలాఖరు, ఏప్రిల్ 10వ తేదీన బంద్ చేసే అవకాశాలు ఉన్నట్లు నీటిపారుదల అధికారులు చెబుతున్నారు. ఈ నీరు బంద్ అయితే ఈ నీటిపై ఆధారపడిన ఎస్ఎస్ ట్యాంకుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేసవి ప్రారంభంలోనే ఎల్ఎల్‌సీ నీటితో ఆయా ప్రాంతాల్లోని ఎస్ఎస్ ట్యాంకులన్నింటినీ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఒకటికి రెండు సార్లు నింపారు. దీంతో నీటి సమస్య ఎక్కడా ఉత్పన్నం కాలేదు. ప్రస్తుతం ఎస్ఎస్ ట్యాంకుల్లో కూడా 50 నుంచి 75 శాతం నీటి నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు నాటికి ఈ నిల్వలు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఎల్ఎల్‌సీ నీటితో మరోసారి ఆయా ట్యాంకులను నింపుకోగలిగితే కొంత ఉపశమనం లభించే అవకాశాలు ఉంటాయి.

స్పందించని ప్రభుత్వం

జిల్లాలో ప్రస్తుత వేసవిలో 76 గ్రామాలు తీవ్ర మంచినీటి ఎద్దడికి గురయ్యే ప్రమాదం ఉందని, ఆయా గ్రామాల్లో వేసవి దాహార్తిని ఎదుర్కొనేందుకు రూ.6.91 కోట్లు వ్యయం కానుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పటికే అనేక గ్రామాల్లో ట్రాన్స్‌పోర్టేషన్, హైరింగ్ ద్వారా నీటిని అందించాల్సిన పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

తాగునీటికి 2 కిలోమీటర్లు వెళ్లాల్సిందే

విద్యుత్ తీగలు తెగిపోవడం, పైప్‌లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో గోనెగండ్ల మండలం బీ అగ్రహారం గ్రామానికి చెందిన ప్రజలు గత వారం రోజులుగా గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని వ్యవసాయ బోర్ల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. సైకిళ్లు, తోపుడు బండ్లు, మోటారు సైకిళ్లపై బిందెలు వేసుకొని పోయి నీటిని తెచ్చుకుంటున్నారు. అలాగే మండల కేంద్రమైన గోనెగండ్లలో కూడా నాలుగు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బైలుప్పల, హెచ్ కైరవాడి గ్రామంలోని బీసీ, జమ్మన్న కాలనీల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. అలాగే ఎమ్మిగనూరు మండలంలోని అల్వాల ఎస్ఎస్ ట్యాంకు నుంచి మూడు రోజులకు ఒకసారి నీరు వదులుతుండడం వల్ల పెసలదిన్నె, గార్లదిన్నె తీవ్ర మంచి నీటి ఎద్దడి నెలకొంది.

గ్రామీణం.. ప్ర'జల' కష్టం

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన అనేక గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొనింది. హాలహర్వి మండలం బాపురం రిజర్వాయర్ నుంచి 27 గ్రామాలకు, చింతకుంట రిజర్వాయర్ నుంచి 11 గ్రామాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే పైప్‌లైన్లు లీకేజీ కావడం, ఓహెచ్‌ఎస్ఆర్‌లు శిథిలావస్థకు చేరడంతో పదుల సంఖ్యలో గ్రామాలకు నీరందని పరిస్థితి నెలకొనింది. చింతకుంట రిజర్వాయర్ కింద టీ చాకిబండ, మల్లికార్జునపల్లి, అమృతాపురం, బళ్లారు తదితర గ్రామాలకు నీరు అందడం లేదు. బాపురం రిజర్వాయర్ కింద ఆస్పరి మండలంలోని చిన్నహోతూరు, జోహరాపురం, నాగనాథనహల్లి రిజర్వాయర్ కింద చిగిలి, తంగరడోణ, అలాగేర, శంకరబండ, నగరూరు గ్రామాల్లో ప్రజల క'న్నీటి' కష్టాలు కనిపిస్తున్నాయి.

అంతటా నీటి ఎద్దడే



పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలం లింగనేనిదొడ్డి, పత్తికొండ మండలం అటికెలగుండు, దేవనబండ, చక్రాళ్ల, పెండ్లిమాన్ తండా, కృష్ణగిరి మండలం బాపనదొడ్డి, పెద్దొడ్డి, బోయ బొంతిరాళ్ల గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. అలాగే ఆదోని మండలం బసరకోడు, అలసందగుత్తి, దిబ్బనకల్, నెట్టేకల్, చిన్న పెండేకల్, పెద్ద పెండేకల్, బైచిగేరి తదితర గ్రామాల్లో బోర్లు సరిగా పనిచేయడం లేదు. పైప్‌లైన్లు సక్రమంగా లేకపోవడం వల్ల నీటి ఇబ్బందులు తలెత్తాయి. జిల్లాలో చాలా గ్రామాల్లో నీటి ఎద్దడి కనిపిస్తోంది.

ఎండుతున్న గొంతులు

హొళగుంద మండలం విరుపాపురం ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీరు సరఫరా కాకపోవడంతో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెరణికి గ్రామంలో 2 వేల జనాభా ఉందని, 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా స్పందన కరువైంది. అలాగే మంత్రాలయం మండలంలోని చెట్నేహళ్లి, కల్లుదేవకుంట గ్రామాలకు ఎస్ఏపీ స్కీం నుంచి నీరు అందడం లేదు. గొంతులు ఎండుతున్నాయని, తాగునీటి సమస్య తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు ఇటీవలే ఎన్‌హెచ్ 167పై రాస్తారోకో నిర్వహించారు. అయినా స్పందన లేదు. ఎస్ఏపీ స్కీం నుంచి నందవరం మండలం ఇబ్రహీంపురం, ఇబ్రహీంపురం కొట్టాల, మంత్రాలయంతోపాటు మరో మూడు గ్రామాలకు అరకొరగా నీరు సరఫరా అవుతోంది.



ఆస్పరి మండలం జోలాపురం గ్రామంలోని వక్కిరేణిలో తగ్గిపోయిన నీరు



గోనెగండ్ల మండలం బీ అగ్రహారంలో రెండు కిలోమీటర్ల నుంచి నీరు తెచ్చుకుంటున్న దృశ్యం



చిప్పగిరి మండలం బంటనహాల్ గ్రామంలో జీఎల్ఎస్ఆర్ నుంచి నీరు తోడుకుంటున్న దృశ్యం

జిల్లాలో నీటి పథకాల వివరాలు...

చేతి పంపులు	: 4,235
ఇందులో పనిచేస్తున్నవి	: 3.799
ఎస్‌బీఎస్ స్కీములు	: 1782
సీపీడబ్ల్యూఎస్ స్కీమ్స్	: 33
ఎస్ఎస్ ట్యాంకులు	: 35

రిజర్వాయర్ల విస్తరణ జరగాలి



ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉంది. జనాభా పెరిగిన నేపథ్యంలో చింతకుంట, బాపురం రిజర్వాయర్లను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దశాబ్దాల క్రితం వేసిన పైప్‌లైన్ల లీకేజీలతో అనేక గ్రామాల్లో నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. అలాగే ఆలూరు చెరువు అన్యాక్రాంతం కాకుండా ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాల్సి ఉంది. అలాగే సమ్మతగేరిలో ఎస్ఎస్ ట్యాంకు, జే హొసళ్లి, బండగట్టులో ఓహెచ్‌ఎస్ఆర్‌లు నిర్మించాలి. దేవనకొండ మండలం కొత్తపేట, పుల్లాపురం గ్రామాలకు పైప్‌లైన్ వేయాలి. పందికోన రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ వేస్తే ఆస్పరి మండలంలోని పలు గ్రామాల నీటి సమస్య తీరే అవకాశం ఉంటుంది.

– బీ విరూపాక్షి , ఆలూరు ఎమ్మెల్యే

శాశ్వత పరిష్కారం చూపాలి



ఆస్పరి మండలంలోని జొహరాపురం గ్రామానికి శాశ్వత మంచినీటి పరిష్కారం చూపాలి. పలు మార్లు అధికారులు, రాజకీయ నాయకుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. అనేక సంవత్సరాలుగా గ్రామంలోని వక్కిరేణి నీటిని తాగుతూ ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఒక ట్యాంకర్ రూ.800 పెట్టి కొనుగోలు చేస్తున్నారు. గ్రామ సమీపంలో రిజర్వాయర్ నిర్మించి హంద్రీనీవా కాలువ నుంచి పైప్‌లైన్ ద్వారా నిల్వ చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– చంద్ర, జొహరాపురం, ఆస్పరి మండలం

చర్యలు చేపడతాం



ప్రస్తుత వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడికి గురయ్యే గ్రామాలను ఇప్పటికే క్షేత్ర స్థాయిలోని అధికారుల ద్వారా నివేదికలు తెప్పించుకొని గుర్తించాం. ఆయా గ్రామాల ప్రజల నీటి కష్టాలను తొలగించేందుకు అవసరమైన ముందస్తు చర్యలను చేపడతాం. అవసరమున్న జనవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కార్యాచరణను రూపొందించాం. ఎల్ఎల్‌సీకి నీరు బంద్ కాకముందే మరోసారి కెనాల్ పరిధిలోని ఎస్ఎస్ ట్యాంకులన్నింటినీ నింపుకుంటాం. ఇప్పటికే వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు రూ.6.91 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– బీ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

ఉల్లాస్... ఉత్తుత్తి పరీక్ష!

కర్నూలు సిటీ: ఉల్లాస్ కార్యక్రమం కింద చదువు నేర్పించకుండానే ఆదివారం పరీక్ష నిర్వహించారు. 'ఉల్లాస్' కింద స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పాలి. జిల్లాలోని కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు, సి.బెళగల్, దేవనకొండ, కృష్ణగిరి, కోడుమూరు, ఆస్పరి, కోసిగి మండలాల్లోని 28,872 మంది పొదుపు మహిళలకు 2,887 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో అక్షర జ్ఞానాన్ని నేర్పించే కార్యక్రమాన్ని వయోజన విద్యకు చెందిన సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలి. కానీ వారు జిల్లా కేంద్రానికి పరిమితమై పర్యవేక్షణ చేయలేకపోయారు. కొన్ని కేంద్రాల్లో స్వచ్ఛందంగా పొదుపు సంఘాల్లోని చదువుకున్న వారు అక్షరాలను నేర్పించినా...అది సంతకాల వరకే పరిమితం అయ్యింది. కొన్ని చోట్ల మినహా చాలా చోట్ల చదువు చెప్పించకపోయినా కూడా ఆదివారం పరీక్ష నిర్వహించారు.



కోసిగిలో ఓ కేంద్రంలో పరీక్షకు హాజరైన మహిళలు

మెజార్టీ కేంద్రాల్లో డీఆర్‌డీఓ గుర్తించిన నిరక్షరాస్య మహిళలు కాకుండా వారి పిల్లలు, అప్పటికే చదువుకున్న వారికి పరీక్ష నిర్వహించారు. కొన్ని చోట్ల పరీక్ష నిర్వహించకుండానే మహిళలతో సంతకాలు చేయించుకున్నట్లు తెలుస్తోంది.

తనిఖీ చేసిన డీడీ

జిల్లాలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పరీక్షను వయోజన శాఖ డీడీ చంద్రశేఖర్ రెడ్డి తనిఖీ చేశారు. ఓర్వకల్లు మండలంలోని పాలకొల్లు గ్రామంలోని కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట పర్యవేక్షకులు నెమలయ్య ఉన్నారు.

కేజీబీవీ పిలుస్తోంది!

- అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చే నెల 11వ తేదీ వరకు గడువు

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీల్లో) అడ్మిషన్లకు ప్రతి ఏటా పోటీ పెరుగుతోంది. 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఇటీవలే నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఆన్‌లైన్‌లో శనివారం నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్(మధ్యలో చదువు మానేసిన వారు), పేద, బడుగు, బలహీన, మైనార్టీ, బీపీఎల్ కుటుంబాల్లోని బాలికలు మాత్రమే అర్హులు. అర్హులైన వారు https:// apkgbv.apcfss.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకే...

బాలికల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు 2004–05 విద్యా సంవత్సరంలో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలను ఏర్పాటు చేశారు. 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు మొదటగా ఏర్పాటు చేసిన స్కూళ్లలో 9,10 తరగతులకు అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడ చదువుతున్న బాలికలు సెకెండరీ విద్యకు దూరం అవుతున్నారని గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఆ స్కూళ్లలో ఇంటర్మీడియెట్, వృత్తివిద్య కోర్సులను ప్రవేశ పెట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 54 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు ఉండగా.. 6 నుంచి 10వ తరగతి వరకు, అలాగే ఇంటర్మీడియేట్ విద్య, వృత్తి విద్యా కోర్సులు ఆంగ్ల మాధ్యమంలో అందిస్తున్నారు. ప్రతి తరగతికి 40 సీట్లు ఉన్నాయి. మైనార్టీలకు ప్రత్యేక కేజీబీవీలు, ఉర్దూ మీడియంలో సైతం ఓ కేజీబీవీ స్కూల్ అందుబాటులో ఉంది.



శ్రీమఠంలో 'న్యాయసుధ' మహోత్సవం

మంత్రాలయం: శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో ప్రతి ఏటా శ్రీమన్ న్యాయసుధ మంగళ మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల నేతృత్వంలో మంగళ మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. వివిధ పీఠాధిపతులు జ్యోతి ప్రజ్వలనతో మహోత్సవానికి అంకురార్పణ పలికారు. మహోత్సవంలో భాగంగా రాఘవేంద్ర స్వామి రచించిన శ్రీమన్ న్యాయసుధ గ్రంథంపై వ్యాఖ్యార్థగోష్ఠి నిర్వహించారు. ముందుగా వేద వ్యాసుడి పూజోత్సవం, శ్రీమన్ న్యాయసుధ శోభ యాత్ర భక్తులను అలరించింది. వేడుకలో వ్యాసరాజ మఠం పీఠాధిపతి విద్యాశ్రీషా తీర్థులు, శ్రీపాదరాజ మఠం పీఠాధిపతి సుజయనిధి తీర్థులు, కృష్ణాపుర మఠం పీఠాధిపతి విద్యాసాగర తీర్థులు, కనియూరు మఠం పీఠాధిపతి విద్యావల్లభతీర్థులు, శిరూర్ మఠం పీఠాధిపతి వేదవర్ధన తీర్థులు, అధమారు మఠం పీఠాధిపతి ఈషాప్రియ తీర్థులు, బందరకెరె మఠం పీఠాధిపతి విద్యేశ తీర్థులు, కన్వమఠం పీఠాధిపతి విద్యాకన్వ విరాజ తీర్థులు, బాలఘర్ మఠం పీఠాధిపతి అక్షోభ్య రామ ప్రియతీర్థులు , చిత్తాపూర్ మఠం పీఠాధిపతి విద్యేంద్ర తీర్థులు, ఉడిపి మఠం పీఠాధిపతులు బన్నంజే రాఘవేంద్ర తీర్థులు, వామన తీర్థులు పాల్గొన్నారు.



శ్రీమఠంలో మహోత్సవానికి జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఠాధిపతులు

అమ్మానాన్నను వీడి అనంతలోకాలకు..

- మిద్దెపై నుంచి పడి చిన్నారి మృతి



మృతి చెందిన బాలిక శ్రీదేవి

కోసిగి: బుడిబుడి నడకలతో..వచ్చీ రాని మాటలతో... ముసిముసి నవ్వులతో అందరినీ మెప్పించే ఆ చిన్నారి ఇక లేరు. ఎప్పుడూ అమ్మానాన్న వెంటే ఉండే ఆ బాలిక ఈ లోకాన్ని వీడి వెళ్లి పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. ప్రమాదవశాత్తూ ఇంటి మిద్దెపై నుంచి పడి మృత్యువాత పడింది. ఈ దుర్ఘటన కోసిగి మండలం వందగల్లు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లంకా ఆంజనేయులు, నాగలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె శ్రీదేవికి మూడేళ్లు ఉండగా.. చిన్న కుమార్తె ఏడాది వయస్సులో ఉన్నారు. ఆదివారం తల్లిదండ్రులు ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె శ్రీదేవి (3) ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ఉంది. ఆటల్లోనే మెల్లగా మెట్లు ఎక్కి మిద్దె పైకి వెళ్లింది. అదే సమయంలో ట్రాక్టర్ శబ్దం రావడంతో తండ్రి వెళ్తున్నాడని భావించి మిద్దెపై నుంచి తొంగి చూస్తూ కింద పడిపోయింది. తలకు తీవ్రమైన రక్త గాయం కావడంతో బైక్‌పై కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కళ్లెదుట కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



కుమార్తె మృతితో రోదిస్తున్న తల్లిదండ్రులు



సమత.. ఆత్మీయత

- ఇఫ్తార్ విందులో సామరస్యం

కర్నూలు (టౌన్): రంజాన్ నెలలో అంతటా సమత, ఆత్మీయత కనిపిస్తోంది. ముస్లింల ఇఫ్తార్ విందులో హిందువులు సైతం పాల్గొని సామరస్యాన్ని చాటిస్తున్నారు. కర్నూలులోని రాయల్ ఫంక్షన్ హాలులో నగర మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ఆదివారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇఫ్తార్ విందులో ముస్లిం మతపెద్దలు, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు మొయిజ్ ఖాన్, సీపీఎం నాయకులు పుల్లా రెడ్డి, సీపీఐ నాయకులు జగన్నాథం, కర్నూలు అర్బన్ క్రెడిట్ సొసైటీ మాజీ చైర్మన్ బాలరాజు, మాజీ చైర్మన్లు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డికి పండు తినిపిస్తున్న కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, చిత్రంలో ముస్లిం నాయకులు

క్లుప్తంగా

వృద్ధుడి మృతి

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఓ వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. అవుకు మండలం కోనాపురం గ్రామానికి చెందిన కె.నర్సిరెడ్డి (80) అనే వృద్ధుడు దాదాపు 20 రోజుల నుంచి ఆకుమల్ల బస్టాండ్‌లో భిక్షాటన చేస్తూ అక్కడే ఉంటున్నాడు. సమయానికి మూడుపూటల ఆహారం లభించక అల్లాడేవాడు.ఈ క్రమంలో ఆదివారం ఉదయం వృద్ధుడి మృతి చెందాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతిడికి కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

వాహనాలు ఢీ.. ఒకరికి గాయాలు



ఎదురెదురుగా ఢీ కొన్న వాహనాలు

పాములపాడు: కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై మండలంలోని కంబాలపల్లి గ్రామం వద్ద ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు స్థానికులు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కేఏ28ఎన్9688 నంబరు గల తుఫాన్ వాహనం శ్రీశైలం నుంచి 12 మంది ప్రయాణికులతో స్వరాష్ట్రానికి వెళ్తోంది. గా ఏపీ39 యూ 6833 నెంబరు గల ట్రాలీ వాహనం కర్నూలు నుంచి అట్టలతో ఆత్మకూరుకు వెళ్తోంది. ఆ రెండు వాహనాలు కంబాలపల్లి గ్రామం వద్ద ఎదురెదురై ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆత్మకూరుకు చెందిన ట్రాలీ డ్రైవర్ షేక్‌కాశీంవలి కాలు విరిగిపోవడంతో చికిత్స నిమిత్తం వెంటనే 108 వాహనం ద్వారా ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

కాటేసిన కరెంట్

గోనెగండ్ల: మండల పరిధిలోని వేముగోడు గ్రామానికి చెందిన మాదిగ భావన్న(30) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సీఐ విజయ భాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. వేముగోడు గ్రామానికి చెందిన మాదిగ భావన్నకు భార్య సునీత, కుతూరు, కుమారుడు ఉన్నారు. వీరు గ్రామంలో పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. శనివారం రాత్రి గ్రామంలో గాలి, ఉరుములు, మేరుపులతో కూడిన వర్షం పడింది. వర్షం పడిన అనంతరం రాత్రి 11:30 గంటలప్పుడు తన మిద్దె మీదకు వెళ్లి పడుకోవాలని మిద్ద పైకి ఎక్కాడు. అయితే అప్పటికే మిద్దమీద గాలికి తెగిన విద్యుత్ సర్వీస్ వైర్ కింద పడిఉంది. అవి తగిలి భావన్న అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసు స్టేషన్‌లో అప్పగింత

పాణ్యం: మండల పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వీడియోలు తీసి మార్ఫింగ్ చేసే విద్యార్థిని ఆదివారం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే .. తమ తోటి విద్యార్థినుల సహాయంతో ఎవరైనా క్లోజ్‌గా మాట్లాడే సమయంలో వారికి తెలియకుండా వీడియోలు తీసేవారు. ఆపై వారి నంబర్లను స్నేహితురాలి సహకారంతో సేకరించి ఆ వీడియోలను మార్ఫింగ్ చేసి పంపి బెదిరింపులకు దిగేవారన్నారు. గతంలో ఒకరితో ఇలాగే చేయగా వారు పోలీసులకు ఫిర్యాదు చేసి సదరు విద్యార్థిని అప్పగించారు. ఈ విషయంపై ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డిని వివరణ కోరగా కళాశాల సిబ్బంది ఫిర్యాదు మేరకు విద్యార్థి అల్తాఫ్‌ను విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



కావడీ మోస్తూ మల్లన్న చెంతకు..



బిడ్డతో వచ్చితిని నీ సన్నిధికి..

కన్నడిగులు కదిలివస్తున్నారు!

ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీశైలానికి పాదయాత్రగా తరలివస్తున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా భక్తి మార్గంలో మల్లన్న చెంతకు చేరుకుంటున్నారు. భజనలు చేసుకుంటూ మల్లన్నను కీర్తిస్తూ.. కావడీలు భుజనా ఎత్తుకుని శ్రీగిరి వైపు వడివడిగా అడుగులు వేస్తున్నారు. శ్రీశైల భ్రమరాంబా దేవిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి చీర, సారె సమర్పించేందుకు బయలుదేరారు. కొంత మంది ఇంటి నుంచి పాదయాత్రగా వస్తుండగా.. మరికొందరు ఆత్మకూరు సమీపంలోని వెంకటాపురం నుంచి నల్లమల అడవుల్లో సుమారు 42 కిలో మీటర్లు పాదయాత్రగా తరలివస్తున్నారు. వృద్ధులు, మహిళలు, చంటి పిల్లల తల్లులు సైతం శ్రీశైలం చేరుకుంటున్నారు. కైలాసద్వారం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, అక్కడే కొంత సేపు సేదతీరి మల్లన్న, భ్రమరాంబ దర్శనం కోసం కూలైన్లలో బారులుదీరుతున్నారు. శ్రీగిరి భక్తజన సంద్రాన్ని తలపిస్తోంది.

– శ్రీశైలంటెంపుల్/జూపాడుబంగ్లా/ఆత్మకూరు



నల్లమల మీదుగా పాదయాత్రగా..



శివయ్యా.. కరుణించు..



మొక్కు తీర్చగా కర్రకాళ్లపై..



కైలాసద్వారం వద్ద భక్తజన సందడి..



నాగలూటి క్షేత్రంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు



భక్తిగీతాలు ఆలపిస్తూ..తలపై అమ్మవారి విగ్రహాన్ని మోసుకొంటూ..

8 మండలాల్లో అకాల వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ఎనిమిది మండలాల్లో శనివారం అకాల వర్షాలు కురిశాయి. అత్యధికంగా వెల్దుర్తిలో 20 మి.మీ. వర్షపాతం నమోదైంది. సీ.బెళగల్‌లో 16.8, కల్లూరులో 9.2, పత్తికొండలో 6.6, ఎమ్మిగనూరులో 3.6, తుగ్గలిలో 2.6, గోనెగండ్లలో 2.0, కర్నూలు అర్బన్‌లో 0.4 మీ.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా 2.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

శ్రీశైలానికి వెళ్తుండగా ప్రమాదం

- కారును ఢీకొన్న లారీ.. ఏడుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కోడుమూరు రూరల్: కర్ణాటక రాష్ట్రంనుంచి శ్రీశైలానికి వెళ్తున్న కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులు గాయపడ్డారు. దుర్ఘటన ఆదివారం కోడుమూరు–కర్నూలు రోడ్డులో ప్యాలకుర్తి వద్ద చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం దావణగేరి జిల్లా నరసగండ్ల హల్లి గ్రామానికి చెందిన మురుగేంద్రయ్య, పద్మావతి, గౌరమ్మలతో పాటు మరో నలుగురు వ్యక్తులు కలిసి శ్రీశైల మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు బయలుదేరారు. కోడుమూరు దాటిన తర్వాత ప్యాలకుర్తి వద్ద కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో మురుగేంద్రయ్య, పద్మావతి, గౌరమ్మలకు రక్తగాయలవ్వగా, మిగిలిన నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేలిన వంట గ్యాస్.. ముగ్గురికి గాయాలు

- గాయపడిన వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం

ఆలూరు రూరల్: వంట గ్యాస్ లీకై సిలిండర్ పేలడంతో ముగ్గురు గాయపడ్డారు. ఇందులో గురుస్వామి, ధర్మ అనే బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. మండలంలోని కురువళ్లి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాలు.. కురువళ్లి గ్రామానికి చెందిన గురుస్వామి తన భార్య గాయత్రి, కుమరుడు ధర్మతో కలిసి ఇంట్లో నిద్రపోయారు. ఆదివారం తెల్లవారు జామున చుట్టుపక్కల వారు.. గ్యాస్ లీకైన వాసన వస్తోందని గురుస్వామికి చెప్పారు. ఆయన లైట్ ఆన్ చేయగానే ఒక్క సారిగా లీకైన గ్యాస్ మంటలు చెలరేగి పెద్ద శబ్దం వచ్చింది. ప్రమాదంలో గురుస్వామి, కుమారుడు ధర్మ తీవ్రంగా గాయపడ్డారు. గాయత్రికి స్వల్పగాయాలయ్యాయి. ఇల్లు ధ్వంసమైంది. క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఆసుపత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం గాయపడిన తండ్రి, కొడుకు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సిలిండర్ పేలి ధ్వంసమైన ఇల్లు

సరదాగా ఈతకెళ్లి..



యువకుని మృతదేహం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైల డ్యాం దిగువ భాగంలోని లింగాలగట్టు కృష్ణానదిలో సరదాగా ఈతకెళ్లిన ఓ బాలుడు నీట మునిగి మృతిచెందాడు. ఎం.వెంకటేశ్వర్లు కుమారుడు కార్తికేయ జస్వంత్ కృష్ణ (16) పదోతరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో తోటి పదోతరగతి స్నేహితులతో కలిసి ఆటవిడుపుగా ఆదివారం లింగాలగట్టు కృష్ణానదిలో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు జస్వంత్ నీటిలో మునిగి మృతి చెందాడు. అక్కడి మత్స్యకారులు గుర్తించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సున్నిపెంట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి దుర్మరణం

కొలిమిగుండ్ల: అనంతపురం జిల్లా వెంకటరెడ్డిపల్లె సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన మురుగేషన్(49) మృతి చెందాడు. మృతుడు 20 ఏళ్ల నుంచి కొలిమిగుండ్లలో ఉంటున్నాడు. మంచాలు, కుక్కర్లు, మిక్సీలు, కూలర్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను కొలిమిగుండ్ల మండలంలోని పలు గ్రామాల్లో వాయిదాలకు ఇస్తుంటాడు. ఉదయం వ్యాపార పని నిమిత్తం బైక్‌పై తాడిపత్రికి వెళ్లి తిరుగు పయనమయ్యాడు. అదే సమయంలో ఇటిక్యాలకు చెందిన ట్రాక్టర్ బెలుం సమీపంలోని నాపరాతి గనిలో రాళ్లను లోడ్ చేసుకొని తాడిపత్రికి వెళుతున్న సమయంలో వెంకటరెడ్డిపల్లె వద్ద బైక్‌ను ఢీకొని మురుగేషన్ తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

ఎక్సైజ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గిరిబాబు, విజయ్‌కుమార్

కర్నూలు: ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక కోలాహలంగా సాగింది. మూడేళ్లకు ఒకసారి సాగాల్సిన అసోసియేషన్ ఎన్నికలు తొమ్మిదేళ్లుగా వాయిదా పడుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఈఎస్‌టీఎఫ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ వ్యవహరించారు. కర్నూలు ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న ఎర్రల వెంకట గిరిబాబు పూర్వపు అధ్యక్షుడు ఓబులేసుపై 86 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. మొత్తం 207 మంది ఓటింగ్‌లో పాల్గొనగా, గిరిబాబుకు 146, ఓబులేసుకు 60 ఓట్లు రాగా, ఒక ఓటు చెల్లలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 14 ఎక్సైజ్ స్టేషన్లు, నంద్యాల కర్నూలు పీఎస్ కార్యాలయాలు, ఈఎస్‌టీఎఫ్, మొబైల్ పార్టీ, చెక్‌పోస్టులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఓటింగ్‌లో పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్ఆర్ అబ్దుల్‌మాలిక్, ఉపాధ్యక్షులుగా బలరాముడు, పీ విరుపాక్షిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జయచంద్రుడు, సహాయ కార్యదర్శులుగా నక్కా సుధాకర్, పాలొళ్ల జగదీష్, ప్రెస్ సెక్రెటరీలుగా కేసీ శ్రీనివాసులు, డీ దస్తగిరి, కోశాధికారిగా కల్పన, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా జీ రాణి, ఎం రవికుమార్, కే వెంకటరాముడు, డీ చిన్న అల్లస్వామి ఎన్నికయ్యారు.



ఎన్నికల అధికారి కేఆర్ రాజేంద్రప్రసాద్ నుంచి డిక్లరేషన్ అందుకుంటున్న విజేతలు

బీసీల హక్కులను కాలరాస్తున్న పాలకులు

కర్నూలు(అర్బన్): పాలక పార్టీలు బీసీల హక్కులను కాలరాస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావుయాదవ్, ప్రధాన కార్యదర్శి టీ మద్దులేటి, ప్రచార కార్యదర్శి ఎం. రాంబాబు, వైఎస్సార్‌పీపీ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు భారతి, ఉపాధక్షులు గ్యాస్ శ్రీనివాసులు, రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. బీసీ కులగణన చేపట్టి జనాభా నిష్పత్తి మేరకు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లకై ఉద్యమాలను చేపడుతామన్నారు. దేశంలో, రాష్ట్రంలో బీసీల ప్రయోజనాలను దెబ్బతీస్తూ వారి హక్కులను కూడా హరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గౌర్రెల పెంపకందారుల సంఘం చైర్మన్ శ్రీనివాసులు, పలు బీసీ కుల సంఘాల నాయకులు నాగేంద్రయాదవ్, శకుంతల, ఉప్పరి శివన్న, ధర్మ, పీజీ వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నక్కలమిట్ట శ్రీనివాసులు

జిల్లా కమిటీలో పలువురికి చోటు ...

ఈ నేపథ్యంలోనే బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీలో పలువురికి స్థానం కల్పించి నియామక పత్రాలను అందించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కుమ్మరి రామక్రిష్ణ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా కుమ్మరి రాజేశ్వరి, కార్యదర్శిగా కే శ్రీనివాసులు, కోశాధికారిగా కే బజారన్న, కే గిరిబాబు, సహాయ కార్యదర్శిగా ఎం రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఏ నాగార్జున, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులుగా బీ రాధ, కార్యదర్శిగా సీ రేణుక, కే లింగన్నను నియమించారు.

ఆదోని సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు

ఆదోని అర్బన్: కోర్టు ఆదేశాలను ధిక్కరించినందున ఆదోని సబ్‌రిజిస్ట్రార్ పాటు మరో ముగ్గురిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బ్రాహ్మణవీధికి చెందిన పవన్‌కుమార్ వద్ద అఖిలేష్‌గుప్తా అనే వ్యక్తి రూ.65 లక్షలు అప్పు తీసుకున్నారు. అప్పు ఇవ్వకపోవడంతో పవన్‌కుమార్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు అఖిలేష్‌గుప్తా ఇంటి, అంగడిని అటాచ్ చేసి.. ఈ రెండింటినీ అమ్మకూడదని జనవరి 28వ తేదీన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కోర్టు ద్వారా నోటీసు వెళ్లింది. అయితే కోర్టు ఆదేశాలను ధిక్కరించి అఖిలేష్ గుప్తా.. సబ్‌రిజిస్ట్రార్ అరుణ్‌కుమార్, డాక్యుమెంట్ రైటర్ భరత్, మరొక వ్యక్తి రమేష్ చంద్రతో మాట్లాడుకుని జనవరి 29న అంగడి, ఇల్లును అమ్మేశారు. అప్పు ఇచ్చిన పవన్‌కుమార్ తెలుసుకుని మరలా కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు సబ్‌రిజిస్ట్రార్ అరుణ్‌కుమార్, డాక్యుమెంట్ రైటర్ భరత్, మరోవ్యక్తి రమేష్‌చంద్ర, అప్పు తీసుకున్న అఖిలేష్‌గుప్తాపై కేసు నమోదు చేయాలని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు కోర్టు ఉత్తర్వులు వచ్చినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నైతిక విలువలకు ప్రాధాన్యం

- ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడ్ స్కూల్స్ యాజమాన్య సంఘం నేతలు

కర్నూలు(సిటీ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో నైతిక విలువలు, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడ్ స్కూల్స్ యాజమాన్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వీ జనార్దన్ రెడ్డి, గౌరవాధ్యక్షులు జీ పుల్లయ్య అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో నగరంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల గుర్తింపును 8 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాలకు పెంచాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలను, ఆరోగ్యశ్రీ కార్డులను, ఇళ్ల నిర్మించుకునేందుకు తక్కువ వడ్డీతో రుణాలను ఇప్పించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ శ్రీనివాసరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు సీఆర్ షాహిదా, పట్టణ అధ్యక్షులు బీ యుగంధర్, కార్యదర్శులు కే శ్రీనివాస్, బీ మాధవక్రిష్ణతో పాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, స్కూళ్లకు అవసరమైన స్టాల్స్ స్టేషనరీ, యూనిఫామ్స్, లేబరెటరీ, సీసీ కెమెరాలు, కంప్యూటర్స్, ఎల్ఈడీ ప్యానల్స్, బోర్డ్స్, బుక్ పబ్లిషర్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి. పుల్లయ్య

'పశుసంవర్ధక' సంఘాలు ఏకగ్రీవం

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖలో మూడు సంఘాలకు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. కర్నూలులోని కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలో నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ సేవానాయక్ హాజరయ్యారు. పశుసంవర్ధక శాఖలో ప్రభుత్వ గుర్తింపు పొందిన వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్స్ సర్వీస్ అసోసియేషన్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్ అసోసియేషన్/ వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు.



నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు

- ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా శాఖ చైర్మన్‌గా జి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా బజారి, ఉపాధ్యక్షులుగా జనార్దన్‌రెడ్డి, రాముడు,వెంకట రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా రంగన్న, కోశాధికారిగా గంగ ఎన్నికయ్యారు.
- లైవ్‌స్టాక్ అసిస్టెంట్స్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జీసీ సుబ్బరాయుడు, అసోసియేట్ ప్రసిడెంటుగా భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆయేశ్వరి, కోశాధికారిగా రాజేష్ ఎన్నికయ్యారు.
- వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా స్రవంతి, అసోసియేట్ అధ్యక్షుడుగా మద్దిలేటి, ప్రధాన కార్యదర్శిగా హనుమంతు, కోశాధికారిగా శశిధర్ ఎన్నికయ్యారు.
- ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా నాయకులు జవహర్‌లాల్, సాంబశివారెడ్డి, రమణ, భాస్కరనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. సంజామల మండలం కానాలకు చెందిన మేడిగ దానియేలు(45) వ్యవసాయ, ఉపాధి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సొంత పనుల నిమిత్తం స్కూటీపై ఆళ్లగడ్డకు వెళుతుండగా పట్టణ శివారులోని పేరా బిల్డింగ్ వద్ద అటువైపే వెళుతున్న టర్బో లారీ వెనుక వైపు నుంచి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దానియేలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య రాణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళుతుండటంతో ప్రమాద ఘటనను చూసిన వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొర్నిపాడు వద్ద లారీని ఆపి పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి శవపరీక్ష నిమత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.